క్లుప్తంగా

ఏఎస్‌ఏపీ సభ్యురాలు డాక్టర్ విజయకు సత్కారం



పాత గుంటూరు: గుంటూరుకు చెందిన ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.విజయ ఆసియా స్ట్రోక్ అడ్వైజరీ ప్యానెల్ (ఏఎస్‌ఏపీ) సభ్యురాలిగా ఎన్నికైన సందర్భంగా భారతి సాంస్కృతిక సంగీత కళావేదిక సభ్యులు ఘనంగా సత్కరించారు. మంగళవారం కొత్తపేటలోని వైద్యశాలలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ విజయను కళావేదిక వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు, సభ్యులు రమణమూర్తి ఆచారి మెమెంటోతో సత్కరించారు.

తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్ సీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రామకృష్ణ



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్ 'సీ' ఆంధ్రప్రదేశ్ సర్కిల్ సహాయ కార్యదర్శిగా ఎం.రామకృష్ణ ఎన్నికయ్యారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఈనెల 10, 11 తేదీల్లో యూనియన్ 40వ రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. మహాసభలకు ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. సభలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఈ.శంకర్ నాయుడు (విజయనగరం), రాష్ట్ర కార్యదర్శిగా శ్రీధర్‌బాబు (తిరుపతి) ఎన్నికయ్యారు. సభలో పోస్టల్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యపై చర్చించినట్లు ఎం.రామకృష్ణ తెలిపారు.

క్షత్రియ ఆత్మీయ సమావేశం



పాత గుంటూరు: చౌడేశ్వరి మాత అనుగ్రహంతో తొగట వీర క్షత్రియులు విద్య, సామాజిక, రాజకీయ పరంగా అభివృద్ధి చెందుతూ సఖ్యతతో మెలగాలని కుల గురువు దివ్యజ్ఞాన జ్ఞానానంద స్వామి అనుగ్రహ భాషణం చేశారు. మంగళవారం చౌడేశ్వరి తొగట వీర క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్.అగ్రహారం శ్రీ రామనామ క్షేత్రంలో తొగట వీర క్షత్రియ ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానానంద గిరి స్వామి ఆధ్వర్యంలో చౌడేశ్వరి అమ్మవారి కలశపూజ, దేవి స్తుతి నిర్వహించారు. అనంతరం తొగట వీర క్షత్రియ సమాజానికి గురు సందేశం ఇచ్చారు. అనంతరం ఆటల పోటీలు, యోగ, నృత్య ప్రదర్శనలు నిర్వహించి బహుమతులు అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మిశెట్టి కృష్ణమూర్తి, కోశాధికారి నరమాల శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు అనంత మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి పూజల అర్జున్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ నలమాల భాస్కరరావు, వెనిగళ్ళ కోటేశ్వరరావు, గౌరవ సలహాదారు కలగిరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కిట్స్ అధ్యాపకునికి డాక్టరేట్



ప్రత్తిపాడు: కిట్స్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ విభాగం అధ్యాపకుడిగా పనిచేస్తున్న మెట్లపల్లి అయ్యప్ప చక్రవర్తికి డాక్టరేట్ లభించింది. యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.తిల్లైకరాశి, డాక్టర్ భానుప్రకాష్ బత్తుల పర్యవేక్షణలో 'ఎ ఫ్రేమ్ వర్క్ ఫర్ క్లాసిఫికేషన్ ఆఫ్ స్పామ్ డేటా యైజింగ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మోడల్స్' అనే అంశంపై అయ్యప్ప చక్రవర్తి చేసిన పరిశోధనకు తమిళనాడు రాష్ట్రం చిందంబరంలోని అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా చక్రవర్తిని స్థానిక కళాశాలలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబులు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు మెడికల్: నగరంలో ముస్లింలకు ఉపయోగపడే లాల్‌జాన్ బాషా షాదీఖానాకు నిధులు మంజూరు చేయాలని, పాత గుంటూరులోని హిందూ స్మశాన వాటికకు విడుదల చేసిన నిధులను సక్రమంగా వాడాలని, బ్రహ్మానంద రెడ్డి స్టేడియం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరిని కలిసి వినతిపత్రం అందజేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చరక కుమార్ గౌడ్ తదితరులు ఉన్నారు.

తపాలా ఉద్యోగుల సమ్మె

లక్ష్మీపురం: ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్ యూనియన్లు మంగళవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లినట్లు తపాల యూనియన్ నేతలు వెల్లడించారు. దేశవ్యాప్తంగా పలు డిమాండ్‌లతో సమ్మెలోకి వెళ్లి మొదటిరోజు పూర్తి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జీడీఎస్‌లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం జరిగిందన్నారు.

మతిమరుపు ముదిరితే ప్రమాదమే!

- అల్జీమర్స్‌పై అప్రమత్తత అవసరం
- వ్యాధి సోకితే తమ పేరు తామే మర్చిపోయే అవకాశం
- ప్రతిఏడాదీ పెరుగుతున్న వ్యాధి బాధితులు



గుంటూరు మెడికల్: వయస్సు పెరుగుతున్న కొద్దీ మతిమరుపు రావటం సహజంగా జరుగుతుంది. దీనినే అల్జీమర్స్ వ్యాధి అంటారు. గతంలో విదేశాల్లో మాత్రమే ఈ మతిమరుపు వ్యాధిబారిన పడే వారిసంఖ్య అధికంగా ఉండేది. నేడు భారతదేశంలో కూడా మతిమరుపు బాధితుల సంఖ్య పెరిగిపోయింది. ఆరోగ్య సంస్థల నివేదిక ప్రకారం ప్రతి 32 సెకన్లకు ఒకరు ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ఇంటినుంచి బయలుదేరిన వ్యక్తి కొంతదూరం వెళ్లాక ఇంటి అడ్రస్ మర్చిపోవటం, తన పేరు కూడా రోగి మర్చి పోయే స్థితికి చేరుకోవటం ఈ జబ్బు లక్షణం. ఆధునిక జీవనశైలి వల్ల ప్రతి విషయాన్ని కూడా స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్స్‌లో ఆన్‌లైన్‌లోనే వెతుకుతూ మెదడును ఏమాత్రం వాడకుండా లేజీగా వదిలివేయటంతో వ్యాధి బారిన పడుతున్నట్లు వైద్యులు తెలిపారు. వ్యాధి వచ్చాక బాధపడటం కంటే రాకుండా ముందస్తు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవటం చాలా ఉత్తమం. నియంత్రణే తప్ప నివారణ లేనిది ఈ వ్యాధి.

వ్యాధి లక్షణాలు...

అల్జీమర్స్ వ్యాధి సోకిన వారు తమ పేరు మర్చిపోతారు. బంధువుల, కుటుంబ సభ్యుల పేర్లు మర్చిపోతారు. పేర్లు మర్చిపోవటంతోపాటుగా వారిని గుర్తించటం కూడా కష్టమే. ఈ వ్యాధి ఎక్కువగా 60 సంవత్సరాలు దాటిన వారిలో వస్తోంది. నేడు 40 ఏళ్ల వారిలో కూడా వ్యాధి లక్షణాలు కనిపించటం ఆందోళన కలిగిస్తోంది.

కారణాలు ..

వ్యాధి రావటానికి జన్యుపరమైన కారణాలు, కుటుంబంలో ఒకరికి వ్యాధి ఉంటే వారసత్వంగా వచ్చే అవకాశం ఉంది. జీవనశైలిలో మార్పులు, నిద్రలేమి, ఒత్తిడికి గురవ్వటంతోపాటుగా బీపీ, షుగర్, గుండెజబ్బులాంటి దీర్ఘకాలిక వ్యాధి బాధితులు సైతం వ్యాధి బారినపడుతున్నారు.

రోజువారీ పనులు సైతం మర్చిపోయే వైనం..

వ్యాధిగ్రస్తులు రోజు వారి కార్యక్రమాలు మర్చిపోతారు. స్నానంచేయటం, బ్రష్‌చేయటం, తిండితినటం కూడా మర్చిపోతారు. వస్తువులను ఎక్కడో పెట్టి ఆ విషయాన్ని మర్చిపోయి ఎవరో దొంగిలించినట్లు అనుమానించటం, చెప్పిన విషయాన్నే పదే పదే చెప్పటం, వస్తువుల పేర్లు మర్చిపోవటం, వాటిని ఏవిధంగా వినియోగించాలో, ఎందు నిమిత్తం వినియోగించాలో అనే అంశాలను సైతం మర్చిపోవటం రోగిలో కనిపిస్తాయి. ఇంటికి తాళాలు వేయటం, కూరలో ఉప్పువేయటం, పాలల్లో తోడు వేయటం వంటివి మర్చిపోవటం వ్యాధిగ్రస్తుల్లో కనిపిస్తాయి. మానసిక ప్రవర్తనలో అకస్మాత్తుగా మార్పులు, వ్యక్తిగత పరిశుభ్రత లోపించటం, అపాయింట్‌మెంట్స్ మర్చిపోవటం, జ్ఞాపక శక్తిని కోల్పోవటం వ్యాధిగ్రస్తుల్లో కనిపిస్తాయి. పసి పిల్లవాడికి ఏవిధంగా స్నానంచేయమని చెప్పాలో అదే విధంగా వ్యాధిగ్రస్తులకు ప్రతి ఒక్క విషయం గుర్తుచేయాలి.

జీజీహెచ్‌లో మెమరీ క్లినిక్



అల్జీమర్స్ వ్యాధిగ్రస్తులకు జీజీహెచ్‌లో అన్ని రకాల వైద్యసేవలు ఉచితంగా అందిస్తున్నారు. ప్రతి శనివారం అల్జీమర్స్ బాధితుల కోసం ప్రత్యేకంగా మెమోరీ క్లినిక్ నిర్వహిస్తున్నారు. న్యూరాలజీ వైద్య విభాగంలో వారంలో మూడు రోజులపాటు ఓపీ వైద్య సేవల్లో సుమారు 500 మందికిపైగా వైద్య సేవలు పొందుతున్నారు. వారిలో 10 మంది అల్జీమర్ వ్యాధి బాధితులే. వ్యాధిని పెరగనీయకుండా చేయటం తప్ప పూర్తిగా తగ్గించే మందు లేదు.

– డాక్టర్ గొట్టిపాటి బిందు సర్మద, న్యూరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్, గుంటూరు జీజీహెచ్

ముందు జాగ్రత్తలే మేలు



వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. ఏదైనా కొత్త విషయాలపై ఆసక్తి చూపటం, పుస్తకాలలో, న్యూస్ పేపర్స్‌లో, మ్యాగ్జైన్‌లలో కనిపించే ఫజిల్స్‌పూర్తి చేయటం, హాబీలు కొనసాగించటం, బీపీ, షుగర్‌లను అదుపులో పెట్టుకోవటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా ఉండటం, క్రమం తప్పకుండా ఆహారపు అలవాట్లు పాటించటం ద్వారా ఈ వ్యాధి దరిచేరనీయకుండా చేయవచ్చు.

– డాక్టర్ పమిడిముక్కల విజయ, న్యూరాలజిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, గుంటూరు

అవయవదానంపై అవగాహన అవసరం



డాక్టర్ కిరణ్‌కుమార్‌ను అభినందిస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు

గుంటూరు మెడికల్: అవయవ దానంపై ప్రజల్లో చైతన్యం కలిగించాల్సిన అవసరం ఉందని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ నుంచి నగరపాలక సంస్థ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సోము ఉదయ్ కుమార్ అనుచరులతో కలిసి అవయవదానం సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కొండా అవినాష్ బాబు అవయవ దానం సర్టిఫికెట్ గురించి సోషల్ మీడియాలో విజ్ఞప్తి పెట్టడంతో సోము ఉదయ్ కుమార్ స్పందించి అవయవ దానం చేసేందుకు ముందుకు వచ్చారని చెప్పారు. బ్రెయిన్ డెడ్‌తో చనిపోయిన మనిషి తన శరీరంలోని అవయవాలను పది మందికి దానం చేసేందుకు అవకాశం ఉందన్నారు. మూత్రపిండాలు, ఊపిరితిత్తులు వంటి అవయవాలు ఇతరులకు ఇవ్వడం వల్ల కొత్త జీవితాలకు ఊపిరి పోసినట్లుగా ఉంటుందని చెప్పారు. విజయ్, అజయ్, లక్ష్మణ్, కొండా అవినాష్ బాబు, పాల్గొన్నారు.

గుంటూరు జీజీహెచ్‌కు ఆల్కలైన్ వాటర్..

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి ఆల్కలైన్ వాటర్ ప్లాంట్‌ను రూ.30 లక్షలతో ఏర్పాటు చేసేందుకు రాయల్ కాప్స్, కారుణ్య సోషల్ సర్వీస్ ఆర్గనేజేషన్ ముందుకు రావడం అభినందనీయమని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం డాక్టర్ కిరణ్ కుమార్‌ను ఆర్గనేజేషన్ వ్యవస్థాపకురాలు దేవి నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు అంగీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి దేవి నాయుడు ముందుకు వచ్చి రూ. 30 లక్షల విలువ విలువ గల ప్లాంట్‌ను అందిస్తామని చెప్పడం సంతోషకరమన్నారు. దేవినాయుడు మాట్లాడుతూ ఆసుపత్రిలో వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి ప్లాంట్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. మొదటి విడతగా రూ.15 లక్షలు, రెండో విడతలో మరో రూ.15 లక్షలు ఖర్చు పెట్టనున్నట్లు వివరించారు.

ఆర్‌ఐ సలాంకి చార్జి మెమో జారీ

నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని చౌడవరం దగ్గర గల స్పీడ్ వే, సక్కు కోళ్ల ఫారాలకు 2012 నుంచి పన్నులు వేయకుండా 2021వ సంవత్సరం పన్ను వేయటం ద్వారా కార్పొరేషన్ ఆదాయానికి రూ.కోటి గండి పడిన విషయం తెలిసిందే. ఈ విషయంపై 5వ డివిజన్ కార్పొరేటర్ రవి సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించారు. దీనికి స్పందించిన కమిషనర్ కీర్తి చేకూరి ఆ సమయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన సలాం కి చార్జి మెమో జారీ చేశారు.

22న పీడీఎస్‌ఓ-ఎన్‌వైఎస్ రాష్ట్ర సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని వైన్ డీలర్స్ కల్యాణ మండపంలో ఈనెల 22న పీడీఎస్‌ఓ-ఎన్‌వైఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పీడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.భాస్కర్ తెలిపారు. మంగళవారం జిల్లాకోర్టు ఎదుట ఉన్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర సదస్సు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ 'విద్యా-ఉపాధి రంగాల సంక్షోభం-పాలకుల విధానాలు-విద్యార్థి, యువజనుల కర్తవ్యాలు' అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని వివరించారు. వి ద్య కార్పొరేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేసి విద్యాహక్కును సాధించుకోవాలన్నారు. పీడీఎస్‌ఓ రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.మోహన్, ఎన్‌వైఎస్ జిల్లా నాయకుడు కె.శ్రీను పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

గుంటూరు ఈస్ట్: వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భారత్‌పేట 8వ లైనుకు చెందిన గడ్డం చందు కృష్ణ రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికి కనిపించకుండాపోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబసభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



సమావేశమైన అదనపు కమిషనర్ లక్ష్మీశివజ్యోతి

నెహ్రూనగర్: రాజకీయ పార్టీల నుంచి అందిన అర్జీలు, ఫిర్యాదులను వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌ఓ కె.లక్ష్మీశివజ్యోతి తెలిపారు. కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు మంగళవారం అదనపు కమిషనర్ చాంబర్‌లో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశాల్లో అందించిన ఫిర్యాదులు, అర్జీలను క్రమ పద్ధతిలో రికార్డ్ చేసి, క్షేత్ర స్థాయిలో బీఎల్‌ఓలు పరిశీలించాలన్నారు. ఈ నెల 9వ తేదీతో నూతన ఓటు దరఖాస్తు, మార్పులు, చేర్పులకు గడువు ముగిసినందున, 9 వరకు అందిన వివిధ ఫారాలను బీఎల్‌ఓలు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, రోజువారి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఏఈఆర్‌ఓ బి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పద్మ, వైఎస్సార్ సీపీ నుంచి జానీబాషా, టీడీపీ నుంచి ఓంకార్, బీఎస్పీ నుంచి సిహెచ్.వాసు, బీజేపీ నుంచి ఆర్.భాస్కర్‌రావు, ఆమ్ ఆద్మీ నుంచి సేవకుమార్, సిపిఎం నుంచి షేక్ ఖాసిం పాల్గొన్నారు.

శివాలయంలో రాహుకేతు పూజలు




పూజల్లో పాల్గొన్న భక్తులు

కిక్కిరిసిన భక్తులు

పెదకాకాని: పెదకాకాని శ్రీభ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం కార్తికమాసం చివరి అమావాస్య సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి రాహుకేతు పూజలు పూజలు జరిపించుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ప్రత్యేకంగా టెంట్‌లు ఏర్పాటు చేశారు. మంగళవారం ఒక్కరోజు 677 రాహు కేతు పూజా టిక్కెట్లు కొనుగోలు చేసి పూజల్లో పాల్గొన్నారు. ఈ టిక్కెట్ల ద్వారా రూ.3,38,500లు ఆదాయం దేవస్థానానికి సమకూరిందని ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలక మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివ శంకర్‌రావు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

నల్లపాడు అగస్త్యేశ్వరాలయంలో...



గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామంలో వేంచేసియున్న గంగా పార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో కార్తిక అమావాస్య పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షిక కార్తి అమావాస్య దీపోత్సవంలో గ్రామంలోని మహిళలు అధికసంఖ్యలో పాల్గొని దీపాలంకరణ చేశారు. అమ్మవారికి పుష్పలంకరణ, స్వామి వారికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయం ముందు దీపాలతో స్వామి అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు పవన్‌కుమార్ శర్మ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



శివాలయంలో రాహుకేతు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గోరంట్ల వేంకటేశ్వరాలయంలో...

గోరంట్లలో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దశావతార కల్యాణ మహోత్సవాలు ఆలయ కమిటీ సభ్యులు, కమిటీ అధ్యక్షుడు గజవల్లి వెంకటప్పారావు నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు. స్వామివారికి మత్స్యావతారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామి కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


యువకుడి మృతిపై ఎమ్మార్పీఎస్ నేతల ఆందోళన



ఎమ్మార్పీఎస్ నేతలతో మాట్లాడుతున్న కొత్తపేట సీఐ

పట్నంబజారు: యువకుడి మృతికి కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నేతలు రాస్తారోకో చేపట్టారు. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం మల్లాపాలెం గ్రామానికి చెందిన నాగిపోగు మోజెస్ (18)ను గత కొద్ది రోజుల క్రితం అక్కడి పోలీసులు కొంత మంది యువకులు గుంపులుగా ఉన్నారని వచ్చిన ఫోన్ కాల్ నేపథ్యంలో స్టేషన్‌కు తీసుకుని వచ్చి పంపించేశారు. మరుసటి రోజు తండ్రి నరసింహారావుతో కలిసి స్టేషన్‌కు వచ్చిన మోజెస్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో మనస్తాపానికి గురైన మోజెస్ ఈ నెల 6వ తేదీన స్టేషన్ వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకుని అంటించుకోవటంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో యువకుడిని మార్కాపురం ఆసుపత్రికి తరలించిన అనంతరం, గుంటూరు ఓల్డ్‌క్లబ్‌రోడ్డులోని తులసి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు వ్యవహరించిన తీరుతోనే మోజెస్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని, పోలీసులు అనవసరంగా వేధించటంతో పాటు దుర్భాషలాడిన పరిస్థితుల్లోనే తట్టుకోలేక ఇటువంటి పరిస్థితులు ఏర్పాడ్డాయని ఆరోపించారు. ఈ క్రమంలో బాధిత కుటుంబానికి అండగా నిలవాలని, ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ..ఓల్డ్‌క్లబ్ రోడ్డులో రాస్తారోకో దిగారు. సంఘటనకు కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న కొత్తపేట, పాతగుంటూరు, లాలాపేట సీఐలు అన్వర్‌బాషా, ఎంవీ సుబ్బారావు, ఎం.శ్రీనివాసరావులు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా కొద్దిసేపటి తరువాత పోలీసులు ఎమ్మార్పీఎస్ నేతలకు సర్దిచెప్పటంతో ఆందోళన విరమించారు.

25వ డివిజన్‌లో 'బాబూ ఆపు నీ నాటకం'



డివిజన్‌లో నవరత్నాల ప్రగతి పత్రాలను అందజేస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 25వ డివిజన్ కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి ఆధ్వర్యంలో మంగళవారం బాబూ ఆపు నీ నాటకం-జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సీఎం వైఎస్ జగన్ పరిపాలనలో నవరత్నాల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను 77, 78 సచివాలయ కన్వీనర్లు మామిడి వెంకటేశ్వర్లు, బాబుతోపాటు వలంటీర్లు, జేసీఎస్ క్లస్టర్ గృహ సారథులు ఇంటింటికీ తిరిగి వివరించారు. నవరత్నాల పథకాల కార్యక్రమాల ప్రగతితో పాటు ప్రతి ఒక్క సచివాలయ పరిధిలో లబ్ధి పొందుతున్న వివిధ వర్గాల ప్రజలకు ప్రగతి పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఆరోగ్య మిత్ర డే



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ విజయ్‌ప్రకాష్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో మంగళవారం ఆరోగ్య మిత్ర డే సదస్సు ఆసుపత్రిలోని శుశ్రుత హాలులో నిర్వహించారు. గుంటూరు జిల్లా ఆరోగ్య శ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ విజయ్ ప్రకాష్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య మిత్రలు విధి నిర్వహణలో అలసత్వం వహించకూడదన్నారు. ఆరోగ్య మిత్ర యాప్‌ను సకాలంలో పూర్తి చేయాలని, ఆరోగ్య ఆసరా విషయంలో ఎటువంటి పెండింగ్ లేకుండా చూడాలని మిత్రలను ఆదేశించారు.

- మిత్ర ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో సెమి క్రిస్మస్ వేడుకలు ఆంధ్రప్రదేశ్ దళిత గిరిజన ఆరోగ్య మిత్ర ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి మాట్లాడుతూ ఏసుక్రీస్తు జన్మదినం, క్రీస్తు బోధనలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా సమన్వయకర్త, జిల్లామేనేజర్ డాక్టర్ విజయ్‌ప్రకాష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి కాకాని అప్పారావు, ప్రత్యూష, ఆరోగ్య మిత్ర జిల్లా నాయకులు గుడేటి అనిల్‌కుమార్, అరుణ్ కుమార్, ఎ.నాగేశ్వరరావు, హరిబాబు, సుబ్బారావు, హుస్సేన్, దీనా కుమారి, భార్గవి, బాపట్ల రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నిషేధంపై కరపత్రం విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ పూర్తిగా నిషేధించబడినదని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ స్పష్టం చేశారు. ర్యాగింగ్ నిషేధంపై మంగళవారం వీసీ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య పి.రాజశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం బోధన, పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సహచర విద్యార్థులకు ఏదైనా ఇబ్బంది కలిగిస్తే ర్యాగింగ్ కిందకు వస్తుందని, ర్యాగింగ్ జోలికి ఎవరు వెళ్లొద్దని సూచించారు. వర్సిటీలో ర్యాగింగ్ నిరోధక కమిటీలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. విద్యార్థులు ఏసమస్యలు వచ్చినా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. క్యాంపస్‌తో పాటు వసతి గృహాలలో స్పెషల్ స్క్వాడ్ బృందాలను నియమించామని తెలిపారు. రెక్టార్ ఆచార్య పి.వర ప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఓఎస్‌డీ ఆచార్య కె.సునీత, సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, సీడీఈ డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, బాలబాలికల హాస్టల్ వార్డెన్‌లు ఆచార్య వెంకట రత్నమ్మ, ఆచార్య నాగరాజు తదతరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో డైరెక్టర్ రాజు, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో గుజ్జనగుండ్లలోని గ్రీన్‌లాండ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు స్కూల్ డైరెక్టర్ వై.ఎస్.రాజు మంగళవారం తెలిపారు. పాఠశాలలో పోటీల్లో విజేతలైన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. రాజు మాట్లాడుతూ ఎల్ఐసీ కాలనీలోని విజ్ఞాన్ హైస్కూల్‌లో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు అనీఫ్, సాయిచరణ్, షాకీర్‌లు బంగారు పతకాలు సాధించారన్నారు. వెంకటేష్, సాత్విక్ బాషా వెండి పతకాలు సాధించినట్లు వెల్లడించారు. కోచ్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగవైకల్యం ప్రతిభకు అడ్డుకాదు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు ఏవీహెచ్ ప్రసాద్, సుబ్బారావు

చేబ్రోలు: అంగవైకల్యం ప్రతిభకు అడ్డుకాదని, వారిపై సానుభూతి చూపకుండా, మనోధైర్యం నింపాలని చేబ్రోలు ఎంఈఓ- 1 ఏవీహెచ్ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ఈ నెల 3వ తేదీన నిర్వహించ వలసిన వేడుకలను తుఫాన్ కారణంగా వాయిదా వేయటంతో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ-2 ఆర్.సుబ్బారావు మాట్లాడుతూ భవితా కేంద్రంలో అందించే సేవలను ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. డిసెంబరు 2వ తేదీన విభిన్న ప్రతిభావంతులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. వివిధ గ్రామాలకు చెందిన కొంతమంది సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లలకు సదరం సర్టిఫికెట్లు, టీఎల్‌ఎం కిట్లను అందజేశారు. ఐఈఆర్టీ టీచర్స్ జి.అనూరాధ, జి.రాజేష్ దినకర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బంగారం చోరీ

పట్నంబజారు: నివాసంలో చోరీ ఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆర్టీసీ కాలనీలో నివాసం ఉండే హసీనా ఈనెల 11వ తేదీ రాత్రి అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న ఆమె తల్లి నివాసానికి వెళ్లారు. మంగళవారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపులు పగులగొట్టి ఉండటం గమనించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా 24 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.